ఉప ఎన్నికలు ఎప్పుడో..?



- గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ
- ఇద్దరు కార్పొరేటర్ల అకాల మరణం
- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మరో ఇద్దరు

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. రెండు స్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా.. ఓ కార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ 2023, జనవరిలో అనారోగ్యంతో మరణించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజీద్‌హుస్సేన్(ఎంఐఎం) నాంపల్లి ఎమ్మెల్యేగా, రామ్నాస్‌పుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం ఇటీవల చనిపోయారు. గ్రేటర్‌లో 150 డివిజన్లు ఉండగా.. వివిధ కారణాలతో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం కౌన్సిల్‌లో 146 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 ప్రకారం.. కార్పొరేటర్ మరణించిన నాలుగు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలి. దేవర కరుణాకర్ మరణించి యేడాదిన్నర కాగా.. మరో ఇద్దరు ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ఎన్నికై 6 నెలలు దాటింది. అయినా ఇప్పటి వరకు ఉపఎన్నికలు నిర్వహించలేదు. ఖాళీ అయిన డివిజన్ల వివరాలు పంపుతూ.. ఉప ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఎన్నికల సంఘానికి జీహెచ్‌ఎంసీ లేఖ రాసింది. షాహీన్ బేగం మరణం నేపథ్యంలో గురువారం ఎర్రగడ్డ స్థానం ఖాళీ అయ్యిందని పేర్కొంటూ కమిషనర్ ఆమోదం తీసుకున్నారు. ఎన్నికల విభాగం ద్వారా ఈ ఫైల్‌ను త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందా..? అన్నది చూడాలి.

అంబర్‌పేటలో పుంజుకున్న కాంగ్రెస్



బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఛీదరణకు గురైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆదరించారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడంతో కాంగ్రెస్ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో 17 రౌండ్ల లెక్కింపు జరగగా 3 రౌండ్లలో కాంగ్రెస్ మెజారిటీ సాధించింది. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఈ నియోజకవర్గంలో 41,393 ఓట్లు వచ్చాయి. 2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆనాడు సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం. అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఈ నియోజకవర్గంలో 13,510 ఓట్లు వచ్చాయి. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డికి 18,400 ఓట్లు మాత్రమే వచ్చాయి. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు 41,393 ఓట్లు వచ్చాయి. అంతేకాకుండా ఈ నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మూడు రౌండ్లలో మెజారిటీ అందించారు. 8వ రౌండ్‌లో దానం నాగేందర్‌కు 4,138 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి 2,978 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ 1,160 ఓట్ల మెజారిటీ సాధించింది. 9వ రౌండ్‌లో దానం నాగేందర్‌కు 4,153 ఓట్లు రాగా బీజేపీ కంటే 439 ఓట్ల లీడ్ సాధించింది. 10వ రౌండ్‌లో దానంకు 3,927 ఓట్లు రాగా బీజేపీపై 645 ఓట్ల మెజారిటీ సాధించింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకుతోపాటు మైనారిటీలు పూర్తిగా అండగా నిలవడంతో ఈ మెజారిటీ సాధించారు.

ఎంపీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి ఎదురుదెబ్బ

బలమైన శక్తిగా ఇండియా కూటమి : టీపీసీసీ నేతలు

నల్లకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలతో మైండ్ గేమ్ ఆడిన మోదీకి 18వ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు బీజేపీకి ఎదురుదెబ్బ తగిలాయని, ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో 240 సీట్లు వచ్చాయని టీపీసీసీ కార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ జీబీ.శ్యామ్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో ఎన్డీయేకు 291 సీట్లు రాగా ఇండియా కూటమికి 233 సీట్లు లభించాయని, తద్వారా ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి బలమైన శక్తిగా అవతరించిందన్నారు. ఈసారి రామమందిరం నిర్మాణం మోదీని గెలిపిస్తుందని భావించినప్పటికీ అక్కడి రాష్ట్రంలోని ఫైజాబాద్ ఎంపీ సీటులో బీజేపీ ఓటమి తప్పిందన్నారు. ముఖ్యంగా యూపీ, మహారాష్ట్రాలలో బీజేపీకి గణనీయమైన సీట్లు తగ్గాయని, యూపీలో 80 సీట్లకు గానూ 36కే పరిమితమైందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ మరింతబలమైన శక్తిగా అవతరించనున్నదని వారు ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లను కైవసం చేసుకుందని, భవిష్యత్‌లో మరింత కర్తవ్యంతో పనిచేస్తామన్నారు.


అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, రాజారాం యాదవ్, వివిధ సంఘాల నాయకులు

బీసీ రిజర్వేషన్లు, హక్కుల సాధనకు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, వాటి హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, వివిధ బీసీ సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం ఈనెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. సమావేశంలో రాజారాంయాదవ్ వివిధ బీసీ సంఘాల నాయకులు నర్సింహయాదవ్, శ్రీహరియాదవ్, నరేందర్, సిద్ధేశ్వర్, రమేష్‌యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణకుమార్, ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ నిర్మాణం: బీజేపీ

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ మూడోసారి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా వికసిత్ భారత్ నిర్మాణం జరుగుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మోదీ పాలన సాగుతుందన్నారు. బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ. సూర్యప్రకాష్‌సింగ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. డా.గౌతమ్‌రావుతో పాటు పలువురు కార్యకర్తలకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని రెండోసారి గెలిపించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి ఎడెల్లి అజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి సి. కృష్ణగౌడ్, యువమోర్చా రాష్ట్రకార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నగర ప్రధానకార్యదర్శి యశ్వంత్, మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనకు వేసవి శిక్షణ దోహదం: సుభాష్

నల్లకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అంతర్లీనంగా నిక్షిప్తమైన జ్ఞాపక, మేధా శక్తిని, సృజనను వెలికితీసేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని టీపీసీసీ ఓబీసీ సెల్‌వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట డివిజన్ శంకరమఠం సమీపంలోని సువర్ణ భారతి మహోత్సవంలో భాగంగా సంస్థ కార్యాలయంలో ఉచిత ధారణా (జ్ఞాపకశక్తి) నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో చిన్నారులకు లస్సీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీబీ.శ్యామ్‌రావు, ఎస్. హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి శిబిరంలో చిన్నారులకు కథలు, భజనలు, రామాయణం, విష్ణు సహస్రనామ స్తోత్రధారణతో పాటు మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శరత్, ఎస్.గిరి, బి.కాంతారావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, కాలేరు శ్రీనివాసరావు, సీహెచ్.మురళీకృష్ణ, విశ్వేశ్వర్‌రావు, దేవిరెడ్డివిజితారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శిబిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. తప్పని అవస్థలు

లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం
అశోక్‌నగర్‌లో నేలకూలిన భారీ వృక్షం

- విరిగిపోయిన మూడు విద్యుత్ స్తంభాలు
- ఇబ్బందులు పడ్డ ద్విచక్ర వాహనదారులు, పాదచారులు

మూడు బైక్‌లు, కారు ధ్వంసం

కవాడిగూడ, రాంనగర్, చిక్కడపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, సుందరయ్య పార్కు జలమయం అయ్యాయి. మోకాళ్లలోతు వరద పోటెత్తింది. అశోక్‌నగర్‌లో భారీ వృక్షం నేలకూలింది. మూడు బైక్‌లు, కారు ధ్వంసమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్తంభాలు విరిగి పోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ విరిగి రోడ్డుపై పడింది. సెల్లార్‌లోని చెట్టు పడిపోవడంతో గేటుకు తాళాలు వేసి బిల్డర్, పనివారు పరారయ్యారు. ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- రాంనగర్/ కవాడిగూడ, చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి


కవాడిగూడ డివిజన్‌లో కురిసిన భారీ వర్షం కారణంగా జలమయమైన రోడ్లలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఇందిరాపార్కుకు వెళ్లే దారిలో అశోక్‌నగర్ బ్రిడ్జి పక్కన ఉన్న లేన్‌లో పెవిలియన్ ఇన్‌ఫ్రాసంస్థవారు కొంతకాలంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం దాదాపు వేల గజాల స్థలంలో సెల్లార్ తవ్వి వదిలేశారు. సెల్లార్ ప్రాంతంలో ఉన్న భారీ వృక్షం గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పడిపోయింది. విద్యుత్ ఫీడర్ వైర్లు తెగిపోయి చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో అశోక్‌నగర్ బ్రిడ్జిబద్ద ట్రాఫిక్ జామైంది. విద్యుత్ సరఫరా బంద్త్తెంది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ డీఈ హేమచందర్, డీఈఈ మక్సూద్, సీబీడీ ఏడీఈ ప్రేమానంద్ తదితరులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జీహెచ్‌ఎంసీ డీఆర్ఎఫ్ బృందం అక్కడకు చేరుకుని చెట్టును తొలగించి, రోడ్డును క్లియర్ చేసే పనులు చేపట్టారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆదేశాల మేరకు బీజేపీ నేతలు వినయ్‌కుమార్, ఉమేష్ తదితరులు చెట్టును తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులందరూ బయటకు వచ్చి పెవిలియన్ ఇన్‌ఫ్రా సంస్థవారు సెల్లార్ తవ్వి వదిలేయడంతోనే ఈదారుణం జరిగిందని మండిపడ్డారు. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఏమీ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


వర్షం దాటికి స్టీల్ బ్రిడ్జి కింద నిలబడి ఉన్న వాహనదారులు


వర్షానికి సుందరయ్యపార్కులో వాకింగ్ ట్రాక్‌లో నిలిచిపోయిన వర్షం నీరు

- బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో ట్రాక్‌లకు వర్షపు నీరు వెళ్లే ఏర్పాట్లు చేయలేదు. నీటి గుంత కూడా నిరుపయోగంగా ఉంది. దీంతో ఈ పరిస్థితి వచ్చిందని వాకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులో ఇంకుడు గుంతను ఉపయోగంలోకి తీసుకురావాలని హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యదర్శి కె.వీరయ్య జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.


నిరుపయోగంగా ఇంకుడుగుంత


కూలిన చెట్టును తొలగించేందుకు సిద్ధంగా డీఆర్ఎఫ్ మిషన్, సిబ్బంది


చెట్టుపడిపోవడంతో వంగిపోయిన విద్యుత్ స్తంభాలు


చెట్టు పడిపోవడంతో ఆ ధాటికి విరిగిపోయి కిందపడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


పరిస్థితిని సమీక్షిస్తున్న విద్యుత్ ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు


అన్నదానం చేస్తున్న మనోహర్‌రెడ్డి, వాడకట్టు రాజు తదితరులు

'రాంనగర్ వాసవీ' సేవ అభినందనీయం

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాలలో రాంనగర్ వాసవీ సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయం అని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 హెచ్ గవర్నర్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అమావాస్యను పురస్కరించుకుని రాంనగర్ వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ చౌరస్తాలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాడకట్టు రాజు, చల్లా శివకుమార్, కోశాధికారి గంజి శ్రీనివాస్, కన్వీనర్ బుక్కా రమేష్, సభ్యులు అనంతుల ఆంజనేయులు, కూర యాదగిరి, ప్రభాకర్, చొక్కారపు రఘురాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కలుషితనీటిని నివారించాలి : కార్పొరేటర్

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో కలుషిత నీటి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని చప్పల్‌బజార్‌లో కలుషిత నీటి సరఫర జరగడంపై ప్రజల ఫిర్యాదుతో గురువారం మంచినీటి పైపులైన్ మరమ్మతు పనులను చేపట్టారు. ఈ మరమ్మతు పనులను కార్పొరేటర్, జలమండలి డీజీఎం సన్యాసీరావు, ఏఈ భావనతో కలిసి పరిశీలించారు. ప్రత్యేక మిషన్ తెప్పించి కలుషిత నీటిని నివారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలలో కలుషిత నీటి నివారణను అరికట్టడానికి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు మల్లికార్జున్, సూరి, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ సాహితీ ప్రక్రియల రచనలో సిద్ధహస్తులు వాసా ప్రభావతి


పురస్కారం అందుకుంటున్న శివప్రసాద్ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వివిధ సాహితీ ప్రక్రియల రచనలో సిద్ధహస్తులు వాసా ప్రభావతి అని విశ్రాంత ఉన్నతాధికారి డా.కేవీ.రమణాచారి అన్నారు. నవల, కథ, వ్యాసం, నాటకం వంటి ప్రక్రియల్లో ఆమె మంచి రచనలు చేశారన్నారు. వాసాఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో డా.వాసా ప్రభావతి శాస్త్రి జయంతి నిర్వహించారు. రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌కు వాసాప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం, ప్రొ.కోలవెన్ను మలయవాసినికి వాసా ప్రభావతి గురుపురస్కారం ప్రదానం చేసి చెరి పాతికవేల నగదును సంస్థ పక్షాన బహూకరించారు. సాహితీవేత్త ఓలేటిపార్వతీశం అధ్యక్షత వహించిన ఈ సభలో గుడిపాటి, పొత్తూరిసుబ్బారావు, డా.వాణిబండారం, శైలజామిత్ర, ప్రభావతి కుమారుడు ప్రకాష్, కూతురు మీనాక్షి, కిన్నెర రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వీధిలో కొన్ని రోజులుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పందించి గురువారం ఉదయం సంబంధిత ప్రాంతాలలో జలమండలి అధికారులు బాలకృష్ణ, మాజీద్‌తో కలిసి వెళ్లి పరిశీలించారు. చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.


త్రోబాల్ ఆటను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం: స్పీకర్

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆవరణలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలను స్పీకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల మక్కువ ఎక్కువ అని అన్నారు. స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఈ పోటీలకు దేశంలోని 26 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళా టీంలు వచ్చాయని మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ చైర్మన్ ప్రేంసాగర్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్, అమీర్‌అలీఖాన్, అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణా రాజ్‌పుత్, చిత్ర, జమీల్, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గజ్జి భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

కారు డ్రైవర్ అదృశ్యం


డి.ప్రకాష్

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో కారు డ్రైవర్ అదృశ్యమయ్యాడు. కాచిగూడ పీఎస్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురా రూక్కస్ ఎళ్ల ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా తల్లి పనిచేస్తోంది. తల్లి బి.రమ పెద్ద కుమారుడు డి.ప్రకాష్ (24) కారు డ్రైవర్. ఈనెల 5వ తేదీన ఉదయం ఏడున్నర గంటలకు కారు డ్రైవింగ్ చేయడానికి వెళ్లాడు. రాత్రి 9 గంటల వరకు తిరిగి రాలేదు. ప్రకాష్ ఫోన్ స్విచాఫ్‌లో ఉంది. ఈ మేరకు తల్లి రమ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసును ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక చికిత్స

- **పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్**


కార్యక్రమంలో వైద్యులు, పిల్లలతో ఎండీ డాక్టర్ గురవారెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక వైద్య చికిత్సలు, సాంకేతికతో సరిచేసి వారు సాధారణ జీవనం గడిపేటట్టు చేయవచ్చునని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ వివరించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్‌డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. వంకర కాళ్లతో సరిగ్గా నడవలేకపోవడం, కూర్చోలేక ఇబ్బంది పడుతుంటారని, దీనిని వైద్య పరిభాషలో క్లబ్‌ఫుట్ సమస్యగా పరిగణిస్తారని డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఇది కొంత మంది పిల్లల్లో వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ఆధునిక శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతోపాటు సాంకేతికతతో సరిచేయడం వల్ల పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా, క్రీడల్లోనూ పాల్గొనవచ్చు అన్నారు. క్లబ్‌ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ పావని


సమస్యను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాలవల్ల అశోక్‌నగర్‌లోని హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహకప్రాంతవాసులు పడే ఇబ్బందుల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని అరుంధతీనగర్ బస్తీని ఆనుకుని నిర్మించిన రిటైనింగ్‌వాల్ వద్ద బస్తీలోని వర్షపునీరు నిలిచిపోవడంతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బస్తీలో పునర్నిర్మిస్తున్న దేవాలయం వద్ద మంచినీటి సరఫరా సమయంలో లీకేజీ ద్వారా రోడ్లపై నీరు చేరుతోందని బస్తీవాసులు గురువారం కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె సంబంధిత జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ ఏఈ శ్యామ్ సుందర్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి బస్తీలో పర్యటించారు. వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ ఓబీసీమోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, నాయకులు రహమత్‌అలీ, కుమార్, ఆనంద్‌రావు, డేవిడ్, ప్రశాంత్, బస్తీవాసులు లక్ష్మణ్, సత్తయ్య, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.